# కాకి తో కబురు (అమరావతి కథలు) - by స్వర్గీయ శంకరమంచి సత్యం

Back Home

ఆ వేపచెట్టు కింద తలెత్తకుండా అంట్లు తోముతోందే - ఆ పిల్ల పేరు జువ్వి. "మడిసల్లే ఎందుకు బతుకుతావే! మానల్లే పడుండు సుకపడతావు" అని ఆ తల్లి కూతురుకి జువ్వి అని పేరెట్టిందేమో తెలియదు. కానీ జువ్వి మనిషిలా బతకాలని, నవ్వాలని, ఏడవాలని కలలు గంటోంది. జువ్వి దొడ్లోకి రావటం ఆలస్యం చెట్ల మీది కాకులన్నీ వచ్చి చేరతాయి. ఉడతలు కొమ్మ తొర్రల్లోంచి పరుగెత్తుకొస్తాయి, రామచిలకలు చిటారు కొమ్మనించి కొంద కొమ్మల మీదికి రివ్వున వచ్చి వాలతాయి. జువ్వి అంట్లు ఒక్కొక్కటే తెచ్చి పడేసుకుంటుంటే కాకులు గెంతుతూ ఇంకా దగ్గర కొస్తాయి. "ఉండండే! ఒకటే తొందర!" అని పిసుక్కుంటుంది జువ్వి. కాకులు ముక్కులు రాసుకుంటూ రెక్కలు తపతప కొట్టుకుంటూ ఇంకా దగ్గరకొస్తాయి. గిన్నెల్లో అడుగు మెతుకులు తీసి రాయిమీద పెడ్తే వాట్ని కలేబడ్తూ తన్నుకుంటూ తింటుంటాయి కాకులు. "కొట్టుకుచావమాకండే కాస్తదానికి" అని మందలిస్తుంది జువ్వి. ఓ కూర ముక్క తొర్రలోంచి తొంగి చూస్తున్న ఉడత కోసం పిసుర్తుంది. కొమ్మ మీదున్న రామచిలకని చూసి "నువ్వు రాణి వాసం పిట్టవాయె! నువ్వు ఎంగిలి మెతుకుల కొస్తావా! ఇదో!" అని వస్తూ వస్తూ ఏరుకొచ్చిన చింతకాయలు ఎగరేస్తుంది. ఒక చింతకాయ రామచిలక ముక్కున పట్టుకుంటే కొందపడ్డ ఇంకో చింతకాయ కోసం ఉడత పరుగెత్తుతుంది.

ఏదో తినటం అయిపోయిందిగదా అని పెళ్ళిపోవు పక్షులు. జువ్వి అంట్లు తోముతుంటే చుట్టూ సభ చేసినట్లు చేరతాయి. ఓ కాకి రాయిమీద ఇంకోటి గుట్ట మీద, మరోటి బోర్లించిన గిన్నెమీద ఇలా చుట్టూ చేరి జువ్వి చెప్పే కబుర్లు ఆలకిస్తూ వుంటాయి. అంట్లు తోముకుంటూ జువ్వి తన వూసంతా పీటికి పెళ్ళబోసుకుంటుంది.

"చింతాలు మావ ఏరేవు నున్నాడో సూసిరాకూడదంటే! ఆడి పడవ అమరావతొడ్డుతాకి సెల్రోజులయింది. నా మెళ్ళో తాళి కడే నేను సక్కంగ వంటచేసి పెడ్డనా? ఆడు పడవల్లోసేరి ఆళ్ళకీ ఈళ్ళకీ వండి పెట్టే కర్మ ఏంది? అవున్లే ఆడిదేం తప్పు? మా అయ్యదే తప్పు. "సంపాదన లేనాడికి పిల్లనిస్తానా" అన్నాడు. పడవల్లో వంటపుట్టికింద చేరిపోయిండు. అమ్మ పోయినకాణ్ణించి అయ్య నిడిసిపెట్టలేక నేనున్నాను. నేం తెచ్చే అన్నం మెతుకుల కోసం నన్నిడిసిపెట్టనంటడు అయ్య. పోన్లే నా అన్నం తింటే తిన్నాడు. ఆణ్ణీ, ఈణ్ణీ డబ్బులడుక్కుని ఆ తాగుడెందుకంట! ఏం జేస్తాం చెప్పు. తాగినా తన్నినా అయ్య అయ్యే కద. నేను మా మావెంట ఎల్లిపోతే ఆడికి దిక్కెవరు? ఏవే! మావ పడవ దొండపాడు రేవుకాడుందన్నారే ఎట్టుండాడో, చూసి రాకూడదంటే.. ఆడు లాంచీల్లో చేర్తాడని ఎవరో సెప్పారు, ఒద్దని సెప్పవే! లాంచీల్లో చేర్తే కిట్ట ఇడిసిపెట్టి గోదార్లో కెల్తాడు. అసలే సూపందదు.

రోజూ ఇదే పాట.. జువ్వి మళ్ళీ మళ్ళీ చెప్తూండడం కాకులు అంతా తెలిసిపోయినట్లు ఆలోచిస్తాం! అన్నట్టు ముక్కులతో రెక్కలు గీరుకుంటూ అంటూండడం. ఇంతలో ఇంటావిడ "జువ్వీ! ఎవరితోనే మాట్లాడుతున్నావు" అంటే "ఏం లేదమ్మా! ఈ కాకులు ఒకటే రొద! హేయ్" అంటూ కాకుల్ని అదిలించి అంట్లు ఇంట్లో ఇచ్చెయ్యటం మామూలు.

ఆ రోజు ఇంటావిడ జువ్వికి ఉప్పుడుపిండి పెట్టి "తినవే" అంది. జువ్వికి ఏం పెట్టినా సరే ఆ ఆకు చేత్తో పట్టుకుని ఏడుస్తుంది. జువ్వి తల్లి కూడ అంట్లు తోమేది. ఇంటివాళ్ళు ఏవన్నా పెడ్తే జువ్వి తల్లి మొగుడికి తెలియకుండ ఐదేళ్ళ జువ్వికి తీసుకొచ్చి పెడ్తే కాని తినేదికాదు. "తినవే" అని తల్లి అంటే "అయ్యకో?" అని ఏడ్చేది. ఇప్పటికీ అంతే, ఆకుపట్టుకుని జువ్వి ఏడుస్తుంటే "ఏడుపెందుకే పిచ్చిదానా!" అని ఇంటావిడ సముదాయిస్తే జువ్వి కళ్ళు తుడుచుకుని "ఇంటికెళ్ళి తింటానమ్మా" అంది. "ఓసి పెర్రి! మీ అయ్యకు నేను వేరే ఇస్తా. నువ్వు తిను" అని ఆవిడంటే అప్పుడు జువ్వి ముఖం విప్పారింది. నవ్వుకుంటూ ఆకు తీసుకు పరుగెత్తింది.

శ్రావణ మాసాన

కృష్ణ నిండుగా వొడ్లు పొంగి పారుతున్న వేళ. పూజారి వీధి ఇళ్ళు ఆనుకుని కృష్ణ పారుతుంటే, కృష్ణ మధ్య నుంచి వడిలో పడవలు పోలేవు కనుక వొడ్డమ్మటే పడవలు లాక్కెళుతుంటే పడవలన్నీ దొడ్లలోంచి పోతున్నట్లుండేవి.

తెల్లవారగట్టే వచ్చింది జువ్వి పడవల కోసం. జువ్వితోపాటే కాకులూ, ఉడతలూ, రామచిలుకలూను. అంట్లు తోముతోందేకాని పడవల మీదే ధ్యాస. పరుగెత్తికెళ్ళి ప్రతి పడవ చూస్తోంది. చింతాలు మావ పడవ రాలేదు. కాకులన్నీ కావుకావు మంటూ కృష్ణ మీది కెళ్ళాయి. అంటే పడవొస్తోందన్నమాట. జువ్వి అంట్ల గిన్నెతో పరుగెత్తుకెళ్ళింది. మాసికల తెరచాప పడవ దగ్గరకొస్తోంది. జువ్వి గుండె దబదబ కొట్టుకుంటోంది. అల్లడుగో! చింతాలు మావ! చుక్కాని దగ్గర వంట గిన్నెతో చెయ్యూపాడు. జువ్వి అంట్లగిన్నె వూపింది. పడవ దగ్గరకొస్తోంది. జువ్వి కళ్ళు పొంగాయి - ఒళ్ళు పొంగింది. కళ్ళలో కృష్ణ ముంచుకొచ్చింది. జువ్వి దగ్గర కొచ్చింది పడవ. చింతాలు

నవ్వుతూ కళ్ళన్నీ జుప్పి మీదే పెట్టి చూశాడు. జుప్పికి ఏదో అడుగుదామనిపించింది. మాట రాలేదు. చింతాలుకి ఏదో చెప్దామనిపించింది - గొంతు పెగల్లేదు. పడవ జుప్పిని దాటిపోతోంది. చింతాలు లంకల్లో కోసుకొచ్చిన జామకాయ వొడ్డు మీదికి విసిరాడు. జుప్పి చెంగున ఎగిరి అందుకుంది. మాసికల తెరచాప దూరమయింది. చింతాలు మావ వెళ్ళిపోయాడు. ఇంటావిడ ఇంట్లోంచి "జుప్పీ!" అని పిలవడంతో జుప్పి ఈ లోకంలోకి వచ్చింది. గెంతుకుంటూ దొడ్లోకొచ్చి ఎక్కడలేని సంబరంతో ఒకచేత అంట్లు తోముతూ ఇంకోచేత ప్రియంగా జామకాయ కొరుక్కు తింటోంది. తనింత కురుక్కుని ఇంత ముక్క కాకులకి పెట్టింది. మరింత ముక్క ఉడతకిచ్చింది. మిగిలిన ముక్క రామచిలకల కెగరేసింది.

ఆ తర్వాత ఇంటావిడ చల్లపిండి పెడ్తే ఆకు పట్టుకు ఏడ్చింది జుప్పి. "మీ అయ్యకి నేను వేరే పెడ్తాలేవే" అన్నా జుప్పి కి ఏడుపు ఆగలేదు. జుప్పి మళ్ళీ ఏడ్చింది అయ్యకోసం గాదు చింతాలు మావకోసం.

కళ్ళు తుడుచుకుని ఇవతలకొచ్చి చుట్టూ చేరిన కాకులతో, ఉడతలతో, చిలకలతో అంది.

"మా మావ పడవ ధరణికోట రేవుకాడుంటది. మీరెళ్ళి నేను మావ కోసం ఏడవలేదని చెప్పండే! నవ్వానని చెప్పండే!" అంటూ గలగలా నవ్వింది.

---

ఈ కథలని ప్రచురించటానికి మాకు అనుమతి ఇచ్చిన శ్రీ శంకరమంచి సత్యం గారి కుమారుడు శ్రీ శంకరమంచి రవిశంకర్ గారికీ, ఈ ప్రయత్నంలో మాకు సహకరించిన శ్రీ JUBV ప్రసాద్ గారికీ మా కృతజ్ఞతలు.